ప్రారంభ లాభాలు ఆవిరి

ముంబై, సెప్టెంబర్ 5: స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు నష్టపోవడం, గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో చివర్లో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలు ఇంట్రాడేలో 222 పాయింట్లు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 151.48 పాయింట్ల నష్టంతో 82,201.16 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ 53.60 పాయింట్లు తగ్గి 25,145.10 వద్ద స్థిరపడింది. తీవ్ర ఊగిసలాటలో కదలాడిన స్టాక్ మార్కెట్లలో బ్లూచిప్ సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు నష్టపోవడం సూచీల పతనానికి ప్రధాన కారణమని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. సూచీల్లో రిలయన్స్ అత్యధికంగా ఒక్క శాతానికి పైగా నష్టపోయింది. దీంతో పాటు టాటా మోటర్స్, నెస్లె, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రాలు అత్యధికంగా నష్టపోయాయి. కానీ, టైటాన్, ఐటీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, ఎస్బీఐలు లాభాల్లో ముగిశాయి.

1:1 బోనస్ షేర్లకు సై

ఆమోదించిన రిలయన్స్ బోర్డు • ఏడేండ్ల తర్వాత ఇప్పుడే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: వాటాదారులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వినాయక చవితి పండుగ కానుకను అందించింది. 1:1 బోనస్ షేర్ల జారీకి ఆ సంస్థ బోర్డు గురువారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో రిలయన్స్ పేర్కొన్నది. ప్రస్తుతం షేర్‌హోల్డర్ల వద్ద ఉన్న రూ.10 విలువైన ప్రతీ ఫుల్ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌కు సమాన విలువలో మరో ఫుల్లీ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌ను ఉచితంగా ఇచ్చేందుకు తమ కంపెనీ బోర్డు సిఫార్సు చేసినట్టు బిలియనీర్ ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ఆర్ఐఎల్ ప్రకటించింది. ప్రస్తుతం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ విలువ రూ.2,987.15 వద్ద ముగిసింది. బుధవారం ముగింపుతో పోల్చితే 1.41 శాతం దిగజారింది.



ఏడేండ్ల తర్వాత..

రిలయన్స్ ఇన్వెస్టర్లకు ఇలా 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు దక్కడం గడిచిన ఏడేండ్లలో ఇదే తొలిసారి. ఇంతకుముందు 2017 సెప్టెంబర్‌లో ఇలాగే 1:1 బోనస్ షేర్లను కంపెనీ ఇష్యూ చేసింది. నాడు కంపెనీ షేర్ ధర దాదాపు రూ.700లుగా ఉన్నది. అంతకుముందు 2009-10లో వాటాదారులకు 1:1 బోనస్ షేర్లు దక్కాయి. అయితే తొలి బోనస్ 1980-81లో జారీ అయ్యింది. 3:5 నిష్పత్తిలో ఇచ్చారు. ఆ తర్వాత 1983-84లో 6:10తో ప్రకటించారు. 1:1 నిష్పత్తిలో మాత్రం తొలిసారి 1997-98లో జారీ చేశారు. మొత్తంగా రిలయన్స్ ఐపీవో దగ్గర్నుంచి ఇన్వెస్టర్లకు ఇది 6వ బోనస్. ప్రస్తుతం దేశీయ అతిపెద్ద కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఉన్న విషయం తెలిసిందే. నిజానికి ఇటీవల నిర్వహించిన కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలోనే ఈ 1:1 బోనస్ షేర్ల జారీ ప్రకటన అధికారికంగా వెలువడింది. అయితే తాజాగా జరిగిన బోర్డు సమావేశంలో దానికి ఆమోద ముద్ర పడింది. కాగా, ఈ బోనస్ షేర్ల జారీ కోసం రికార్డు తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఇదిలావుంటే కంపెనీ ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్‌ను రూ.15,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్లకు పెంచుకోవడానికి కూడా కంపెనీ బోర్డు ఈ సందర్భంగా అనుమతిచ్చింది. దీంతో షేర్ హోల్డర్ల అనుమతిని సంస్థ కోరుతున్నది.

జియో వార్షికోత్సవ ఆఫర్లు

దేశీయ టెలికం రంగ దిగ్గజం రిలయన్స్ జియో.. 8వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం తమ కస్టమర్లకు పలు రిచార్జ్ ప్లాన్లపై ఆఫర్లను ప్రకటించింది. జియో.కామ్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం ఈ నెల 5 నుంచి 10వ తేదీ మధ్య ఎవరైతే 3 నెలల ప్లాన్లు, ఏడాది ప్లాన్‌ను రిచార్జ్ చేసుకుంటారో వారికి రూ.700 విలువైన 3 ప్రయోజనాలను అందిస్తున్నట్టు తెలిపింది. వీటిలో 10 ఓటీటీలు, రూ.175 విలువైన 28 రోజుల వ్యాలిడిటీ గల 10జీబీ డాటా ప్యాక్, ఉచిత జొమాటో 3 నెలల గోల్డ్ మెంబర్‌షిప్ ఉన్నాయి. కాగా, రూ.899, రూ.999లతో ఉన్న త్రైమాసిక ప్లాన్లు.. రూ.3,599తో ఉన్న వార్షిక ప్లాన్లకే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయి. త్రైమాసిక ప్లాన్లలో కస్టమర్లకు రోజూ 2జీబీ డాటా ఉంటుంది. ఇక రూ.899 ప్లాన్ గడువు 90 రోజులైతే.. రూ.999 ప్లాన్ కాలవ్యవధి 98 రోజులు. అలాగే రూ.3,599 ప్లాన్ గడువు 365 రోజులు. రోజూ 2.5జీబీ డాటాను వాడుకోవచ్చు. 2016 సెప్టెంబర్‌లో ఉచిత వాయిస్ కాల్స్, చౌక ధరలకే ఇంటర్నెట్ సేవలతో భారతీయ టెలికం రంగంలోకి జియో సంచలనాత్మక ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. 2జీ, 3జీలను పక్కనబెట్టి 4జీతో పరిచయమైంది. ఈ క్రమంలోనే కేవలం 170 రోజుల్లోనే 10 కోట్ల కస్టమర్ల మార్కును జియో తాకింది. అంతేగాక జియోఫోన్ (ఇంటిలిజెంట్ స్మార్ట్‌ఫోన్), జియోభారత్ (అల్ట్రా-అఫర్డబుల్ 4జీ ఫోన్), జియో ఫైబర్, ఎయిర్‌ఫైబర్ (ఫిక్స్‌డ్ వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ ఆఫర్), పూర్తిస్థాయిలో 5జీ సర్వీసులనూ అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలి వార్షిక వాటాదారుల సమావేశంలో జియో యూజర్ల కోసం 100జీబీదాకా ఉచిత క్లౌడ్ స్టోరేజీని కూడా ముకేశ్ అంబానీ ప్రకటించిన సంగతి విదితమే. ఏఐ సాంకేతికతతో వివిధ ఫీచర్లను కస్టమర్లకు అందిస్తున్నట్టూ పేర్కొన్నారు.

బుచ్ రాజీనామా చేయాలి

సెబీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల నిరసనలు

ముంబై, సెప్టెంబర్ 5: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉద్యోగులు నిరసనల బాట పట్టారు. అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న సెబీ చీఫ్ మాధబీ పురి బుచ్ రాజీనామాను కోరుతూ ఇక్కడి బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోగల హెడ్ ఆఫీస్ ఎదుట పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన ఇచ్చారు. బుచ్‌తో పాటు ఈ వ్యవహారంలో ఉన్న ఇతర అధికారుల కార్యాలయాల ముందూ నిరసనల్ని వ్యక్తం చేశారు. ఇందులో 200 మందికిపైగా పాల్గొన్నట్టు అంచనా. వీరిలో ఎవరూ మీడియా ముందు మాట్లాడలేదు. కానీ బుధవారం సెబీ విడుదల చేసి పత్రికా ప్రకటనను ఉపసంహరించుకోవాలని, సెబీ చీఫ్ రాజీనామా చేయాలని నినదించారు. సుమారు గంటన్నరపాటు ఈ నిరసనలు కొనసాగాయి. నిజానికి గతంలోనూ ఇదే తరహాలో సెబీ ప్రధాన కేంద్రం వద్ద ఆందోళనలు జరిగాయి. అయితే వాటికి, ఉద్యోగులకు ఎలాంటి సంబంధం లేదని అక్కడి ఉన్నతాధికారులు కొట్టిపారేశారు. ఆ నేపథ్యంలో తాజా ఉద్యోగుల నిరసన మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. అదానీ గ్రూప్ వ్యవహారంలో బుచ్ పాత్ర కూడా ఉందని, విదేశాల్లోని కొన్ని సంస్థల్లో ఆమెకు, ఆమె భర్తకు వాటాలున్నాయని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ బయటపెట్టింది. అప్పట్నుంచి బుచ్ వార్తల్లో నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే ఆగస్టు 6న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు సెబీలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, ఉన్నతాధికారుల తీరు అస్సలు బాగాలేదంటూ దాదాపు 500 మంది ఉద్యోగులు లేఖ రాశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో సెబీ ఓ పత్రికా ప్రకటనను విడుదల చేస్తూ అంతా ఉట్టిదేనంటూ కొట్టిపారేసింది. ఇది ఉద్యోగులకు మరింత ఆగ్రహాన్ని తెచ్చిపెట్టింది.

సహారా రూ.1,000 కోట్లు కట్టాలి

సహారా గ్రూప్.. ఓ ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో 15 రోజుల్లోగా రూ.1,000 కోట్లను డిపాజిట్ చేయాలని సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. అలాగే రూ.10,000 కోట్ల డిపాజిట్ కోసం ముంబైలోని వార్సోవా వద్దనున్న భూమి అభివృద్ధికి జాయింట్ వెంచర్ ఏర్పాటుకు అనుమతించింది.

ఈవీల సంస్థలకు రాయితీలు అవసరం లేదు

కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: విద్యుత్‌తో నడిచే వాహన తయారీ సంస్థలకు రాయితీలు ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టంచేశారు. ప్రస్తుతం కొనుగోలుదారులు సొంతంగా ఈవీలు లేదా సీఎన్‌జీ వాహనాలను ఎంచుకునే స్థాయికి చేరుకున్నారని బీఎన్‌ఈఎఫ్ సమ్మిట్‌లో చెప్పారు. ప్రారంభంలో ఈవీల తయారీదారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా రాయితీలు ప్రకటించినట్లు, ఆ తర్వాతి క్రమంలో వీటికి డిమాండ్ ఊపందుకున్నదని, దీంతో ఉత్పత్తిపై పెట్టే ఖర్చులు తగ్గుముఖం పట్టడంతో సంస్థలకు ఇచ్చే రాయితీలు అనవసరమని మంత్రి వ్యాఖ్యానించారు. పెట్రోల్, డీజిల్ వాహనాల కంటే ఎలక్ట్రిక్ వాహనాలపై విధిస్తున్న జీఎస్టీ తక్కువ స్థాయిలో ఉన్నదన్నారు. హైబ్రిడ్స్ వాహనాలతోపాటు పెట్రోల్, డీజిల్ వాహనాలపై 28 శాతం జీఎస్టీని వసూలు చేస్తుండగా, అదే ఎలక్ట్రిక్ వాహనాలపై 5 శాతం విధిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వంతో నజారా టెక్ జట్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 5: గేమింగ్, ఈ-స్పోర్ట్స్ కంపెనీ నజారా టెక్నాలజీస్..రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఒప్పందంలో భాగంగా గేమింగ్, డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంపై మరింత దృష్టి సారించడానికి ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయబోతున్నది. 'నజారా ఏఐ సీవోఈ' పేరుతో ఏర్పాటు చేస్తున్న ఎక్సలెన్స్ సెంటర్‌తో రీసర్చ్, డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్‌లపై మరింత దృష్టి సారించడంతోపాటు గేమింగ్, ఇంటరాక్టివ్ మీడియా, గేమిఫైల్డ్ లెర్నింగ్, ఇతర డిజిటల్ కంటెంట్, బ్లాక్‌చెయిన్, వెబ్3.0లపై దృష్టి సారించడానికి వీలు పడనున్నదని నజారా టెక్నాలజీ జాయింట్ ఎండీ, సీఈవో నితీష్ మిట్టర్సేన్ తెలిపారు. మరోవైపు, ఈ-గవర్నెన్స్, కృత్రిమ మేధస్సు సాంకేతికతలను వినియోగించి పౌర సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయనున్నట్లు సోషల్ మీడియా దిగ్గజం మెటా ప్రకటించింది.

ఫార్మా విలేజీల్లేవ్.. క్లస్టర్లే!

1,000-2,000 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వ యోచన

భూములు ఇచ్చేందుకు స్థానికులు ససేమిరా..

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీ స్థానంలోనే ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. సుమారు 1,000 నుంచి 2,000 ఎకరాల స్థలంలో ఈ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేయోచనలో సర్కార్ ఉన్నది. ఇందుకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సుమారు రూ. లక్ష కోట్ల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బయోఏషియా-2024 సదస్సు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ముందుగా వికారాబాద్, మెదక్, నల్గొండలలో ఈ విలేజ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు, ఒక్కో విలేజ్‌ను వెయ్యి నుంచి రెండు వేల ఎకరాల్లో ఉంటుందని ఆయన తెలిపారు. అయితే ఈ మూడు జిల్లాల్లో ఒకే చోట 1000ఎకరాల భూమి అందుబాటులో లేదని కలెక్టర్లు తేల్చిచెప్పడంతో రాష్ట్ర సర్కార్ దీనిపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. కానీ ఎలాగైన వికారాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ పద్ధతిలోనైనా ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. అయితే, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం ఆలస్యం కావడం, భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేదిలేదని స్థానికులు తేల్చిచెప్పడంతోపాటు వారిని చుట్టుముట్టి ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఫార్మాసిటీ కోసం గతంలో వచ్చిన దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండటంతో ఆయా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అవసరమైతే 2,000 ఎకరాల వరకైనా ఫార్మా క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలనుకుంటున్నారు. అయితే, గతంలో ప్రతిపాదిత ఫార్మాసిటీలో అన్ని రకాల ఔషధ పరిశ్రమల ఏర్పాటునకు వెసులుబాటు కల్పించాలని నిర్ణయించగా, తాజాగా ప్రతిపాదిత ఫార్మా క్లస్టర్‌లో కాలుష్యం కలిగించే బల్క్‌డ్రగ్ పరిశ్రమలను మినహాయించాలని నిర్ణయించారు. ఫార్మారంగంలో తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా హైదరాబాద్‌కు ఉన్న ప్రత్యేకతను సుస్థిరం చేసే విధంగా గత బీఆర్ఎస్ సర్కారు రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో సుమారు 14,029ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటునకు ప్రతిపాదించినది తెలిసిందే. మొదటి దశలో 8,900ఎకరాల్లో ఔషధ పరిశ్రమల ఏర్పాటునకు అవసరమైన ప్రణాళికలను కూడా గత ప్రభుత్వం సిద్ధం చేసింది. ఫార్మాసిటీలో సుమారు రూ. 64,000 కోట్ల పెట్టుబడులు, తద్వారా 4.20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనావేసింది.

మలబార్ గోల్డ్ 20 షోరూంలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. భారత్‌లో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. వచ్చే నెలలో దేశవ్యాప్తంగా 20 షోరూంలను ప్రారంభించబోతున్నది. వీటిలో ఉత్తరప్రదేశ్‌లో మూడు, ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్‌లలో రెండేసి చొప్పున..ఒడిశా, తెలంగాణ, బెంగాల్, పంజాబ్‌లలో ఒక్క షోరూంను ప్రారంభించాలనుకుంటున్నట్లు మలబార్ గ్రూపు చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. దీంతోపాటు షార్జా, ఖతార్, సౌదీ అరేబియా, ఉత్తర అమెరికాల్లో నూతన షోరూంలు అందుబాటులోకి తీసుకురానున్నది.

మీషోలో 8.5 లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: ప్రస్తుత పండుగ సీజన్‌లో మరో ఈ-కామర్స్ సంస్థ మీషో భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకోవడానికి సిద్ధమైంది. విక్రయదారులు, లాజిస్టిక్ సేవల పరిధిలో 8.5 లక్షల మంది సీజనల్ సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వీరిలో అత్యధిక మంది తృతీయ శ్రేణి పట్టణాల్లో ఈ నియామకాలు ఉంటాయని పేర్కొంది.

మెర్సిడెజ్ బెంజ్..మరో ఎలక్ట్రిక్ మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. మేబ్యాచ్ ఈక్యూస్ 680 ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.2.25 కోట్లుగా నిర్ణయించింది. ఈ ధరలు ముంబై షోరూంనకు సంబంధించినవి. 107.8 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 611 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 4.4 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 210 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం అరగంటలోనే 80 శాతం వరకు చార్జింగ్ కానున్నది.

పత్తిపంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

కురవి, సెప్టెంబర్ 5: రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంటలను సర్వే చేసి నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మలేడి కోటయ్య డిమాండ్ చేశారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో బలపాలలోని నేలవాలిన పత్తి, మిరప పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతాంగానికి కనీసం ఎకరానికి రూ.20వేలు ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించి ఓదార్చినా జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. సర్వం కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ.50వేలు, కూలిన ఇళ్లను ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు వెంకన్న, దర్గయ్య, మోహన్‌రావు, సత్యనారాయణ, దర్గయ్య, ఉపేందర్, రాంబాబు పాల్గొన్నారు.

గిరిజన ఉపాధ్యాయులకు అవార్డులు

దంతాలపల్లి, సెప్టెంబర్9: గురుపూజోత్సవం సందర్భంగా ప్రభుత్వం అందించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 2023-24 పదో తరగతి పరీక్షల్లో వందశాత్తం ఫలితాలు సాధించినందుకు దంతాలపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు వీరాసింగ్, సోమేశ్వర్, విజయభాస్కర్, శరత్, శ్రీనివాస్, కిసాన్, కవిత, భాస్కర్ ఎంపికయ్యారు. గురువారం ఏటురునాగారం ఐటీడీఏలో ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్ర మిశ్రా ఐఏఎస్ చేతుల మీదగా ప్రశంసా పత్రం, అవార్డులు అందుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia. ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును

No. C/C/E-Auction/SC/2024-25,
తేది: 05-09-2024.

PUB/0880

భారత రాష్ట్రపతి, యూనియన్ ఆఫ్ ఇండియా తరపున సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే వారు కమర్షియల్ ఎర్నింగ్ మరియు NFR కాంట్రాక్టుల కొరకు ఇ-వేలం కోరుతున్నారు. తదనుగుణంగా సికింద్రాబాద్ డివిజన్ దిగువ కేటగిరీల కొరకు ఇ-వేలం ప్రాసెస్ చేసింది మరియు అవి https://www.ireps.gov.inలో ప్రకటించబడినవి.

క్ర. సం.	కేటగిరీ	ఇ-వేలం తేది
1	పే & యూజ్ టాయిలెట్స్	09-09-2024, 10-09-2024, 20-09-2024
2	PMBJK - ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి కేంద్రాలు	09-09-2024
3	పార్కింగ్	13-09-2024
4	కేటరింగ్	13-09-2024
5	ATM	10-09-2024
6	PnY (పే అండ్ యూజ్ - లాంజెస్ / వెయిటింగ్ / రీటెయిరింగ్ / క్లోక్ రూమ్స్)	14-09-2024
7	Misc (బ్యాటరీ స్వాపింగ్)	14-09-2024

పూర్తి వివరాల కొరకు https://www.ireps.gov.in/website సందర్శించవచ్చు. ఏవేని విచారణలు/ స్పష్టీకరణల కొరకు దిగువ సంతకందారు కార్యాలయాన్ని సంప్రదించగలరు.

A1135 సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్.

ఘనంగా టీచర్స్ డే

- పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి
- జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం
- సమాజంలో టీచర్ వృత్తి ఉన్నతమైనది
- ప్రముఖులు, హెచ్‌ఎంలు, నాయకులు

చిన్నగూడూరు: రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నర్సింహులపేట: పడమటిగూడెంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్/ చిన్నగూడూరు/ బయ్యారం/ గార్ల/ నర్సింహులపేట/ దంతాలపల్లి/ కురవి/కొత్తగూడ/ మరిపెడ, సెప్టెంబర్ 5: జిల్లాలో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలు, కళాశాలల్లో రాధాకృష్ణన్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖులు, హెచ్‌ఎంలు, ప్రాన్సిపాళ్లు, నాయకులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. గురువులను గౌరవిస్తూ పట్టుదలతో చదవి లక్ష్య సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. వేలమంది విద్యార్థులను తీర్చిదిద్దాడని, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలను వివరించారు. మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సంకా బద్రినారాయణ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంచి ప్రవర్తన గల విద్యార్థులను తయారు చేస్తూ లక్ష్య సాధన వైపుగా నడిపిస్తారన్నారు. అనంతరం విద్యార్థులు గురువులను శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయులు స్నేహలత, రమాదేవి, సుజాత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాధాకృష్ణన్ జీవిత పాఠాలు నేర్చుకోవాలి

గార్ల: సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత పాఠాలు విద్యార్థులు నేర్చుకోవాలని గార్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి అన్నారు. కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించి మమాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆడపాల ప్రసాద్, ఉపాధ్యాయులు చాంప్లా, లక్మాలాల్, జోగ్యానాయక్, సత్యనారాయణ, రవీందర్ సోమన్న, సుజాత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

పెద్దవంగర/పెద్దవంగర(తొర్రూరు): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన అందుతుందని వాసవీక్లబ్ అధ్యక్షుడు బిజ్జాల అనిల్‌కుమార్ అన్నారు. గురువారం పెద్దవంగర, తొర్రూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. పోటీతత్వం అలవర్చుకొని ముందకు సాగాలన్నారు. క్లబ్ ప్రతినిధులు రాము, రాంబాబు, రవి, సాయితేజ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ తరగతి గదిలోనే

కేసముద్రం: దేశ భవిష్యత్ తరగతి గదిలోనే ఉన్నదనే విషయాన్ని ఉపాధ్యాయులు గ్రహించాలని వివేకవర్ధిని హైస్కూల్ కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ అన్నారు. పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటానికి ఆయన నివాళులర్పించి మాట్లాడారు. ప్రిన్సిపాల్ చిర్ర నరేశ్, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి ఉన్నారు. కేసముద్రం విలేజి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు కుర్న హరినాథ్, సురేందర్, నరసయ్య, భాస్కర్‌ను సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ.10వేల విలువైన కుర్చీలను పాఠశాలకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, పీఈటీ కొమ్ము రాజేందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డోర్నకల్: మన్నెగూడెం జడ్పీహెచ్‌ఎస్‌ఎస్‌లో ..

తొర్రూరు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రతినిధులుధులు

మహబూబాబాద్ రూరల్: ఉపాధ్యాయులకు సన్మానం

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

పెద్దవంగర(తొర్రూరు), సెప్టెంబర్ 5: వరద బాధితుల సహాయార్థం తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం విరాళాల సేకరణ చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతు వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజల కోసం సహాయం చేసే ప్రధాన ఉద్దేశంతో విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, అధ్యాపకులు సువర్ణ, ఉప్పలయ్య, నరసయ్య, అన్నపూర్ణ, రామబ్రహ్మాచారి, అనిత, శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

బాలుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లికుదురు, సెప్టెంబర్ 5: ఇనుగుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడిపై పోక్సో కేసు నమోదైనట్లు విశ్వసనీయ సమాచారం. ఓ గ్రామానికి చెందిన బాలుడు ఆదే గ్రామానికి చెందిన బాలికను కొన్ని రోజులుగా వేధిస్తున్నాడని, ఆ బాలిక తల్లిదండ్రులు నెల్లికుదురు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ఐదు రోజులైనా సర్కారు ఏం చేస్తున్నది..?

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

నెల్లికుదురు/ కేసముద్రం, సెప్టెంబర్ 5: మండలంలోని రావిరాల గ్రామం వరద ముంపునకు గురై ఐదు రోజులైనా బాధితులకు ఎలాంటి ఆర్థిక సాయం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తున్నదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ ప్రశ్నించారు. గురువారం గ్రామంలో ఆయన పర్యటించి బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వరద బాధితులకు కేంద్రం రూ.1,350 కోట్లు మంజూరు చేయడంతో పాటు 2 హెలికాప్టర్లను కూడా పంపించిందన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు వరద బాధితులకు తక్షణ సాయం అందించలేదని ఆరోపించారు. పంటలు నష్టపోయిన వారికి ఎకరాలకు రూ.50వేలు, ఇండ్లు కూలిన వారికి ఇండ్లు నిర్మించిఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేసముద్రం మండలంలో వరద బీభత్సానికి నష్టపోయిన బాధితులను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

ధ్వంసమైన ఆటోను పరిశీలిస్తున్న హుస్సేన్ నాయక్

కబడ్డీ క్రీడాకారుడి ప్రతిభ

డోర్నకల్, సెప్టెంబర్ 5: మండలంలోని చాప్లా తండాకు చెందిన కబడ్డీ క్రీడాకారుడు ధరావత్ మల్సూర్ నేపాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ యూత్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ -2024 పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. ఈ సందర్భంగా చాప్ల తండా గ్రామస్తులు, క్రీడాకారులు మల్సూర్‌ను అభినందించారు.

మల్సూర్‌ను అభినందిస్తున్న కోచ్

నిత్యావసర సరుకులు అందజేత

డోర్నకల్, సెప్టెంబరు 5: దుబ్బగడ్డ తండాలో వరద బాధితులకు కిసాన్ పరివార్ సంస్థ సభ్యులు గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. 69 బాధిత కుటుంబ సభ్యులకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో కిసాన్ పరివార సంస్థ సీఈవో డాక్టర్ వివేక్, సభ్యులు భీమానాయక్, విష్ణు నాయక్, రామ్మూర్తినాయక్, మంగీలాల్, వెంకన్న పాల్గొన్నారు.

ఎన్‌కే ఆగ్రో ఎక్స్‌పోర్ట్స్ ఆధ్వర్యంలో..

డోర్నకల్: తోడేళ్లగూడెం ఎన్‌కే ఆగ్రో ఎక్స్‌పోర్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ముల్కలపల్లిలోని 135 మంది వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు. తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో శ్రీనివాసరావు అందజేశారు. స్పెషల్ ఆఫీసర్ రుక్మందరావు, పంచాయతీ కార్యదర్శి శశిధర్, మధు, జగదీశ్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దవంగర, సెప్టెంబర్ 5: సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉంచాలని ఎంపీడీవో వేణుమాధవ్ అన్నారు. గురువారం ఉప్పరగూడెం, మోత్యాతండా జీపీల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన వార్డు సభ్యుడు రమేశ్

గూడూరు, సెప్టెంబర్ 5: పొనుగోడు గ్రామానికి చెందిన మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, వార్డు మాజీ సభ్యు డు బెజ్జం రమేశ్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కొందరు తన ను ఇబ్బంది పెట్టడం వల్లనే కాంగ్రెస్‌లో చేరానని, కానీ ఆపార్టీ విధానాలు నచ్చలేదని, కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ చేసిన పాలనే బాగున్నదని బీఆర్ఎస్‌లో చేరానని రమేశ్ తెలిపారు.

గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

డోర్నకల్, సెప్టెంబర్ 5: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తోడేళ్లగూడెంలో గురువారం జరిగింది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన డీ వెంకన్న (47) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 4న మధ్యాహ్నం భార్యతో గొడవపడి మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏటిగడ్డ తండాలోని ఓ ఇంట్లో చోరీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 5: పట్టణ శివారు ఏటిగడ్డ తండాలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు కాసోజు బ్రహ్మచారి కథనం ప్రకారం.. ఈ నెల 1న తన భార్యకు అనారోగ్య కారణంగా హైదరాబాద్ దవాఖానకు తీసుకెళ్లానని, తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయన్నాడు. ఇంట్లో ఉన్న 12 తులాల బంగారం, రూ. రెండు లక్షల నగదు దొంగలు చోరీ చేసినట్లు పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.